



ఎస్పీ శ్రీనివాసరావు (పల్నాడు జిల్లా)



ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ (గుంటూరు జిల్లా)



● పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మాజీ సీజేఐ ఎన్వీ రమణ



పాలనలో ఆధ్యాత్మికతతోపాటు ఆధునికతను జోడిస్తాను. పేదరికం లేని రాష్ట్రమే ధ్యేయం. రాష్ట్రంలో నవ్వులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం జీవితాల్లో ఆనందం నింపుతుందని అందరూ చెబుతుంటే సంతోషకరంగా ఉంది. దేశంలో ఉన్న గొప్ప సంపద కుటుంబ వ్యవస్థ. దీనిని భావితరాలకు అందించాలి. ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్న శక్తి భగవంతుడే. ప్రార్థనాలయాలు ఏ మతానికి సంబంధించిన వైనా ఈ భూమిపై లేకపోతే నేరాలు ఘోరాలు ఎన్నో జరిగేవి. సైంటిస్టులు, డాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, న్యాయవ్యవస్థ ఇలా అందరూ విధులు ప్రారంభించడానికి ముందు రెండు నిమిషాలు దేవుడిని ప్రార్థిస్తారు. హరేకృష్ణ మూమెంట్, ఇస్కాన్‌లు పోటీ పడి మన సంస్కృతిని కాపాడుతున్నాయి. - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

# ఆధ్యాత్మికత.. ఆధునికత

- పాలనతో జీవితాలు ఆనందమయం
- ధర్మాన్ని కాపాడుతున్న ధార్మిక సంస్థలు
- అక్షయ పాత్ర, గోకుల క్షేత్ర సేవలు భేష్
- కొలనుకొండ గోకులక్షేత్రంలో సీఎం చంద్రబాబు నాయుడు

తాడేపల్లి, జూలై 13: ప్రపంచాన్ని ముందుకు నడిపించేది నమ్మకమేనని, మనకు తెలియని ఏకైక శక్తి దేవుడేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. తాడేపల్లి మండలం బైపాస్‌లోని కొలనుకొండ హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ అనంత శేష స్థాపన, గర్భాలయ భూస్పర్శ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ ధర్మాన్ని కాపాడడానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండడం అందరి అదృష్టమన్నారు. ప్రభుత్వం తరఫున కూడా ఇలాంటి సంస్థలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఏ కార్యక్రమాన్ని అయినా సజావుగా చేయగలమన్న నమ్మకాన్ని హరేకృష్ణ మూమెంట్ కలిగిస్తుందన్నారు. హరేకృష్ణ మూమెంట్‌తో పోటీ పడి ఇస్కాన్ కూడా కార్యక్రమాలు చేస్తుందని చెప్పారు. మధు పండిత దాస అనుకున్నది సాధిస్తారని, నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడతారని తెలిపారు. హరేకృష్ణ మూమెంట్‌లో సత్య గౌర చంద్రదాస సహా ఐఐటీలో చదివిన వారు 50 మంది ఉన్నారని తెలిపారు. ఇస్కాన్‌లో కూడా ఐఐటీ గ్రాడ్యుయేషన్ పొందిన వారు ఉన్నారన్నారు. తానెప్పుడు వేంకటేశ్వరస్వామినే నమ్ముతానని, తమ కుటుంబ ఆరాధ్య దైవం వేంకటేశ్వరస్వామి అని చెప్పారు. 2003లో తిరుపతిలో క్లైమోర్ మైన్స్ పేలినప్పుడు తనకు ప్రాణ భిక్ష పెట్టింది వేంకటేశ్వరస్వామి అని చెప్పారు.

### అమరావతి.. ఆధ్యాత్మికం

హరేకృష్ణ గోకుల క్షేత్రంలో 6.5 ఎకరాల్లో వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం జరుగుతుందని 216 అడుగుల ఎత్తున్న ప్రధాన గోపురంతో వేంకటేశ్వరస్వామి, రాధాకృష్ణ దేవాలయం నిర్మిస్తున్నారని, అమరావతిలో ఇదొక ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందన్నారు. కూటమి గెలుపుతో ప్రజల్లో సంతోషం నెలకొందన్నారు. తెలుగువారు నెంబర్ వన్‌గా ఉండాలని తాను కోరుకుంటానన్నారు. ప్రపంచంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో 30 శాతం మంది తెలుగువారు ఉండడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల ధరలు పెరిగాయన్నారు. ఒక శాతం వృద్ధి రేటు పెరిగితే రాష్ట్రానికి 15 వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు.

### అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

అన్న క్యాంటిన్లకు భోజన సరఫరా బాధ్యతలను గతంలో అక్షయపాత్రకు తాను అప్పగించినట్లు చంద్రబాబు చెప్పారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు నాడు నిర్వహించగా గత ప్రభుత్వం మూసేసిందన్నారు. త్వరలో రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. శ్రీకృష్ణ ఆలయం ఉన్న పది కిలోమీటర్ల పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదని లాలా ప్రభుపాద స్ఫూర్తితో అక్షయపాత్రను ప్రారంభించారన్నారు. 23 ఏళ్లలో 400 కోట్ల మందికి భోజనం పెట్టారని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో పరిశుభ్రంగా నాణ్యతతో 22 లక్షల మందికి ప్రతి రోజూ అక్షయపాత్ర ద్వారా ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాసరాజు, సక్కు గ్రూప్, యలమంచిలి కృష్ణమోహన్ గ్రూప్ రూ.కోటి చొప్పున ఇస్కాన్ సంస్థకు విరాళం ప్రకటించగా చంద్రబాబు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, రాజ్యసభ సభ్యుడు రవీంద్రకుమార్, మంత్రి సవిత, మంత్రి నారాయణ, గోకుల క్షేత్ర, ఇస్కాన్ ప్రతినిధులు మధు పండిత్ దాస, సత్య గౌర చంద్రదాస, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్‌డూడి, మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై నాగరాజు, పలువురు అధికారులు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక ఒరవడి: జస్టిస్ రమణ

అమరావతిలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టడం శుభసంకేతమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ తెలిపారు. ఆధ్యాత్మికతతోపాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడడం ముఖ్యమన్నారు. గోకుల క్షేత్ర నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందన్నారు. ఎవ్వరూ అర్ధాకలితో ఉండకూడదనే అక్షయ పాత్ర ద్వారా ఇస్కాన్ అన్నదానం చేస్తుందని చెప్పారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ తోడ్పాటు ఇచ్చిందన్నారు. అన్న క్యాంటీన్లను త్వరలో పునరుద్ధరించడం శుభపరిణామమని చెప్పారు.

### ఉత్తమ నగరంగా అమరావతి : మధు పండిత్

ప్రపంచ ఉత్తమ నగరంగా అమరావతి నిలుస్తుందని అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్ తెలిపారు. ఉత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వెలుగొందాలన్నారు. పాండవులు నడయాడిన అమరావతిలో నవ యుగ ధర్మరాజుగా చంద్రబాబు రాజధాని అమరావతి నిర్మాణం తలపెట్టారన్నారు. అమరావతిలో గోకుల క్షేత్రం ప్రాజెక్టును 150 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు.



గోకుల్ క్షేత్రంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్, మంత్రి నారాయణ, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

# ఎస్పీలు బదిలీ

- మూడు జిల్లాలకు మారారు
- బాపట్లకు గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ
- పల్నాడుకు శ్రీనివాసరావు
- గుంటూరుకు సతీష్‌కుమార్

గుంటూరు/ నరసరావుపేట, బాపట్ల జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మూడు జిల్లాలకు ఎస్పీలు మారారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఎస్పీలను నియమించారు. ఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయగా వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్పీలు ఉన్నారు. గుంటూరు ఎస్పీ తుషార్ డూడీని బాపట్లకు మార్చగా, ఆయన స్థానంలో ఎస్ సతీష్‌కుమార్‌ను నియమించారు. గత ఎన్నికలకు ముందు నుంచి తుషార్ డూడీ గుంటూరు ఎస్పీగా పనిచేస్తున్నారు. 2016 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సతీష్‌కుమార్ ప్రస్తుతం కాకినాడ ఎస్పీగా ఉన్నారు. ఇప్పటివరకు బాపట్ల ఎస్పీగా ఉన్న వకుల్ జిందాల్‌ను విజయనగరం ఎస్పీగా నియమించారు. ఇక పల్నాడు ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన విజయవాడ రూరల్ డీసీపీగా ఉండగా ఆయన్ను పల్నాడు జిల్లాకు మార్చారు. ఇప్పటివరకు పల్నాడు ఎస్పీగా విధులు నిర్వహించిన మల్లికాగర్గ్‌ను విజయనగరం జిల్లా 5వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు.



ఎస్పీ తుషార్ డూడీ (బాపట్ల జిల్లా)

### ఇక త్వరలో డీఎస్పీలు, సీఐల వంతు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిగా శనివారం ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఎట్టకేలకు తాజాగా ఐపీఎస్‌ల బదిలీ ప్రక్రియ పూర్తి కాగా త్వరలో డీఎస్పీలు, ఆ తర్వాత సీఐల బదిలీలు ఉంటాయని సమాచారం. బదిలీల కోసం ఆయా అధికారులు ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుతీరి నెల రోజులు గడిచినా ఇంకా పాత సీఐలే ఆయా విధుల్లో కొనసాగుతున్నారు. దీనిపై పార్టీ కేడర్ నుంచే కాక ప్రజల నుంచి, సంబంధిత పోలీసు వర్గాల నుంచి కూడా కొంత వరకు అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఐపీఎస్‌ల బదిలీల నేపథ్యంలో ఇక అదనపు ఎస్పీలు, డీఎస్పీలను రెండు, మూడు రోజుల్లో బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సీఐల బదిలీలు జరగనున్నాయని సమాచారం.

### తుషార్‌డూడీకి రెండో పోస్టింగ్

2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి తుషార్‌డూడీ ఎస్పీగా తొలి పోస్టింగ్ గుంటూరు జిల్లా కాగా రెండో పోస్టింగ్ బాపట్ల జిల్లా. బాపట్ల ఎస్పీగా సుదీర్ఘకాలం పనిచేసిన వకుల్‌జిందాల్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా ఆవిర్భావం తర్వాత వకుల్‌జిందాల్‌కు తొలిసారి ఎస్పీగా ఇక్కడే పోస్టింగ్ దక్కింది. 26 నెలలు పాటు వకుల్ జిందాల్ బాపట్ల ఎస్పీగా సేవలందించారు. అత్యంత కీలకమైన ఎన్నికల ఘట్టం కూడా ఆయన సారథ్యంలోనే ముగిసింది. వైసీపీ పాలనలో జిల్లాలు ఏర్పడ్డాక దాదాపు ప్రతి జిల్లాకు కొత్త ఎస్పీలను నియమించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే చోట విధుల్లో ఉన్న ఎస్పీలు ముగ్గురు కాగా అందులో వకుల్ ఒకరు కావడం గమనార్హం.

### కాకినాడ నుంచి గుంటూరుకు..

ప్రస్తుతం కాకినాడ జిల్లా ఎస్పీగా ఉన్న సతీష్ కుమార్ గుంటూరుకు బదిలీపై రానున్నారు. తమిళనాడులోని ఈరోడ్ ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ 2016లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2018లో మొదటిసారిగా చింతపల్లి ఏఎస్పీగా ఏడాదిన్నర విధులు నిర్వ హించారు. ఆ తర్వాత మావోయిస్టు కార్యకలాపాల అణచివేతకు సంబంధించి నర్సీపట్నం ఓఎస్‌డీగా 14 నెలలు, విశాఖ పరిధిలో సెబ్ ఏ ఎస్పీగా తొమ్మిది నెలలు, అల్లూరు సీతారామరాజు మన్యం జిల్లా ఎస్పీగా 13 నెలలు పని చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కాకినాడ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఐపీఎస్‌గా సతీష్‌కుమార్ నాలుగేళ్లు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కీలక భూమిక పోషించారు. మావోయిస్టు కార్యకలాపాలను అణచి వేసే క్రమంలో సతీష్‌కుమార్ అనేక కార్యక్రమా లను చేపట్టి విజయవంతమయ్యారు. గంజాయి పెంపకం, అక్రమ రవాణా, విక్రయాలపై కూడా ఉక్కు పాదం మో పారు.

### 26 నెలలు.. నలుగురు ఎస్పీలు

పల్నాడు జిల్లా ఏర్పడి 26 నెలలు అవుతుంది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ముగ్గురు ఎస్పీలు పనిచేశారు. జిల్లాకు నాలుగో ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు విజయవాడ రూరల్ డీసీపీగా పనిచేస్తున్న అయన బదిలీపై పల్నాడుకు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఎస్పీలు ఎన్నికల కమిషన్ చర్యలతో బదిలీ అయ్యారు. బొప్పుడి వద్ద జరిగిన ప్రధాని మోదీ సభకు సంబంధించి భద్రతా వైఫల్యాల నేపథ్యంలో రవి శంకర్‌రెడ్డిని బదిలీ చేశారు. పోలింగ్, అ తర్వాత జిల్లా లో జరిగిన హింసాత్మక సంఘటలను పురష్కరించుకుని బిందు మాధవ్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మల్లికా గార్గ్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించారు.

### శాంతి భద్రతలపై కఠిన వైఖరి - సతీష్‌కుమార్

శాంతి భద్రతలను పరిరక్షించే విషయంలో కఠిన వైఖరి అవలంబించనున్నట్లు ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తానన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

### రేపు విధుల్లో చేరే అవకాశం

ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. అదే రోజు ఎస్పీ తుషార్‌డూడీ విధుల నుంచి రిలీవ్ కానున్నారు.

# రేపల్లెకు పట్టిసీమ

- గోదారమ్మతో కాల్వలు కళకళ
- హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

రేపల్లె, జూలై 13: పట్టిసీమ ప్రవాహంతో తీరప్రాంతంలోని రేపల్లె పులకించింది. నాలుగేళ్ల తర్వాత గోదావరి నీరు రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రేపల్లె మెయిన్ కెనాల్‌కు పట్టిసీమ నీరు భారీగా చేరింది. దీంతో ప్రధాన కాల్వలన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. కాల్వల్లో నీరు సమృద్ధిగా రావడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే కొంతమంది నీరు ఎప్పుడు వస్తుందో తెలియక వర్షాలపై ఆధారపడి వెద పద్ధతిలో సాగుకు విత్తనాలు చల్లుకున్నారు. వర్షాభావంతో రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ప్రస్తుతం గోదావరి నీరు జిల్లాలోకి ప్రవేశించడంతో ఆయా గ్రామాల్లోని చెరువులు నింపే పనిలో అధికారు లు నిమగ్నమయ్యారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పట్టి సీమపై దృష్టి సారించి ఇటీవల నీటిని విడుదల చేయడంతో అవి శనివారానికి తీరానికి చేరాయి. వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లు పట్టిసీమను నిర్వీర్యం చేయడంతో డెల్టాలో వేలాది ఎకరాలకు నీరందక రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారు. ఈ పరిస్థితుల్లో పట్టి సీమ నీరు రాకతో అటు సాగునీరు, ఇటు తాగు నీటి కష్టాలు తీరినట్లేనని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లలో చివరి భూముల వరకు ఇదే విధంగా నీటిని అందిస్తే పంటలు బాగా పండతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రేపల్లె ప్రాంతంలో మెయిన్ కెనాల్‌కు చేరిన పట్టిసీమ నీరు

# వర్షం.. హర్షం



● గుంటూరు రూరల్ మండలంలో సాగు చేసిన పత్తి పంట

- సమృద్ధిగా కురిసిన వర్షాలు
- సాగుకు సిద్ధమైన అన్నదాతలు
- పత్తి, వరి వైపు అధిక శాతం మొగ్గు
- పల్నాడులో ఇప్పటికే వేసిన పంటలకు ఊపిరి

గుంటూరు సిటీ, జూలై 13: వరుణుడు కరుణలేదు.. వాతావరణశాఖ చెప్పినట్లు వర్షాలు లేవు.. అదును తప్పుతోంది.. అని ఆందోళనలో ఉన్న అన్నదాతలను మురిపిస్తూ శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో కరువుతీరా వర్షం పడింది. నాన్పుడు వానతో భూమి పదునెక్కింది. దుక్కి దున్ని సిద్ధంగా ఉంచుకున్న పొలాల్లో విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమయ్యారు. నైరుతి రుతుపవనాలు వచ్చాక కొంత వాన కురిసినప్పటికీ పదును చాలదని రైతులు ఇన్ని రోజులు సాగుకు దూరంగా ఉన్నారు. తాజాగా కురిసిన వర్షాలకు పుడమి దాహం పూర్తిగా తీరడంతో నాట్లుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం కురిసిన వాన గుంటూరు జిల్లాలోనే అధికంగా పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పల్నాడులో గత వారం లో కొన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాలపై ప్రస్తుతం వరుణుడు కరుణించాడు. బాపట్ల జిల్లాలో కూడా పంటల సాగుకు ప్రస్తుత వర్షపాతం సరిపోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

### దుగ్గిరాలలో అత్యధికం..

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దుగ్గిరాలలో 148.8 మి.మీ అధికశాతం వర్షపాతం నమోదైంది. గుంటూరు పశ్చిమలో 142.2, గుంటూరు తూర్పులో 136.2, తెనాలిలో 123.4, కొల్లిపరలో 115.8, చేబ్రోలులో 107, ఫిరంగిపురంలో 105, పెదకాకానిలో 103.4, వట్టిచెరుకూరులో 86.6, ప్రత్తిపాడులో 85.4, మేడికొండూరులో 80.6, పొన్నూరులో 48, పెదనందిపాడులో 42.4, తాడికొండలో 37.6, కాకుమానులో 37.2, మంగళగిరిలో 33, తుళ్లూరులో 29.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 37.5, నూజెండ్లలో 21, పిడుగురాళ్లలో 18.5, శావల్యాపురంలో 17, నాదెండ్లలో 12, బెల్లంకొండలో 10, బాపట్ల జిల్లా అమర్తలూరులో 93.5, చెరుకుపల్లిలో 67.5, రేపల్లెలో 41.5, నిజాంపట్నంలో 38, నగరంలో 33, చీరాలలో 26.25 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు ప్రకటించారు.

### అన్ని పంటలకు అనుకూలమే..

ప్రస్తుతం కురిసిన వర్షంతో అన్ని పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. భూమి పదునెక్కడంతో తాడికొండ, ప్రత్తిపాడు, పెదనందిపాడు, ఫిరంగిపురం మండలాల్లో పత్తి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. పొన్నూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాల్లో రైతులు వరి నారుమళ్లు సిద్ధం చేసుకుం టున్నారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పత్తి సాగుతో పాటు, మిరప నారుమళ్లు పోశారు. బాపట్ల జిల్లాలో వరి నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.



# తీరంలో అప్రమత్తంగా ఉండాలి

- బీచ్‌లను పరిశీలించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 13: వర్షాకాలంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. తీరప్రాంతాల్లో ఇటీవల అలల తాకిడికి అనేకమంది గల్లంతై మృత్యువాతపడిన నేపథ్యంలో శనివారం కలెక్టర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. బాపట్ల మండలం సూర్యలంక, చిన గంజాం మండలం మోటుపల్లి, రుద్రమాంబపురం, నిరీక్షణగిరి, వేటపాలెం మండలం కటావారిపాలెం, చీరాల మండలం ఓడరేవు బీచ్‌ల్లో కలెక్టర్ పర్యటించారు. బీచ్‌ల వద్ద భద్రత పెంచాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ మత్స్యకారులకు సూచించారు. వేటకు అవసరమైన బోట్లు, ఇతర పరికరాలపై ఆరా తీశారు. మత్స్యకార జీవన స్థితిగతులు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమిళనాడుకు చెందిన బోటు అక్రమంగా జిల్లా పరిధిలోని సముద్ర జలాల్లోకి ప్రవేశించి వలలు తెంపుకుని వెళుతున్నాయని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని మత్స్యకారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పర్యాటకులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా వారికి అవగాహన కల్పించాలని మత్స్యకారులకు సూచించారు. ఎవరైనా మద్యపానం చేసి సముద్రంలోకి వెళుతున్నట్లు గుర్తిస్తే మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గంధం రవీందర్, సూర్యనారాయణ రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సూర్యలంక సముద్రతీరాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకట మురళి

# ఎట్టకేలకు 12 రైళ్లకు అదనపు జనరల్ బోగీలు

● రిజర్వుడ్ తరగతుల బోగీలపై తగ్గనున్న భారం

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లను నామమాత్రం జనరల్ బోగీలతో నడుపుతూ సాధారణ ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న రైల్వేశాఖ ఎట్టకేలకు వాటిసంఖ్యని పెంచాలని నిర్ణయించింది. గుంటూరు మీదగా ప్రయాణించే 12 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ బోగీలు జతచేస్తారు. దీనివల్ల జనరల్ బోగీల్లో ప్రయాణించేవారికి కాస్త ఉపశమనం లభించనుంది. వచ్చే వారం నుంచి ఈ బోగీలను జోడించి నడపనున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. వాటిల్లో సికింద్రాబాద్-హౌరా, హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, కాకి నాడపోర్టు-భావనగర్, భావనగర్-కాకినాడపోర్టు వీక్లీఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-భువనేశ్వర్, భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-యశ్వంత్‌పూర్, యశ్వం త్‌పూర్-మచిలీపట్నం కొండవీడుఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-ధర్మవరం, ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, కాకినాడపోర్టు-ఎల్‌టీటీ(ముంబై), ఎల్‌టీటీ-కాకినాడపోర్టు ఎక్స్‌ప్రెస్‌లున్నాయి.

ప్రస్తుతం ఈ రైళ్లు కేవలం రెండు జనరల్ బోగీలతో నడుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒకటి ముందు, మరొకటి వెనక భాగంలో ఉంటున్నాయి. మరికొన్ని సందర్భాల్లో రెండు బోగీలూ పక్కపక్కనే ఉంటున్నాయి. దీనివల్ల ప్రయాణీకులు గందరగోళానికి గురౌతున్నారు. మరోవైపు రైళ్లరద్దు కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని స్లీపర్‌క్లాస్, కొన్ని సందర్భాల్లో ఏసీ బోగీల్లోనూ జనరల్ టిక్కెట్‌తో ఎక్కి టీటీఈలతో ఈఎఫ్‌టీలు రాయించుకొని ప్రయాణిస్తున్నారు. దీనివల్ల ఆయా బోగీల్లో కన్‌ఫర్మ్ బెర్తుల ప్యాసింజర్లకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. కనీసం టాయ్‌లెట్స్‌కు వెళ్లలేని పరిస్థితి. దొంగతనాలు జరిగినా నేరస్తులను గుర్తించలేని పరిస్థితులు తలెత్తాయి. ఇటీవల విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మిర్యాలగూడ వద్ద మహిళ ప్రయాణీకురాలిపై ఒడిస్సాకు చెందిన ప్రయాణీకుడు అసభ్యకరంగా ప్రవర్తించి రైల్లో నుంచి కిందికి తోసేశాడు. ప్రమాదంలో ఇద్దరు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. దీనిపై ఇప్పటికే రైల్వేమంత్రికి ట్విట్టర్‌లో అనేక ఫిర్యాదులందాయి. దీంతో దిద్దుబాటు చర్యగా జనరల్ బోగీలను పునరుద్ధరించారు. ప్రతీ రైలులో కనీసం 4 జనరల్ బోగీలు ఉండబోతున్నాయి. వీటిల్లో రెండు ముందు, రెండు వెనక ఉండే అవకాశం ఉన్నది. వీటికి అదనంగా మహిళలు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఒక ఎస్‌ఎల్‌ఆర్ బోగీ ఉంటుంది.

# డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు

● బాధితులకు మంత్రి నారాయణ, యరపతినేని పరామర్శ

● స్వయంగా కాల్వల్లో పూడిక తీసిన మంత్రి, ఎమ్మెల్యే

పిడుగురాళ్ల, జూలై 13: పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలలో డయేరియా వ్యాప్తిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి ప్రజారోగ్యానికి నష్టం కలుగకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ అన్నారు. లెనిన్‌నగర్ ఆసుపత్రిలో డయేరియా బాధితులను పరామర్శించిన అనంతరం లెనిన్‌నగర్, మారుతీనగర్ కాలనీలలో పర్యటించి రెండు రోజుల క్రితం వున్న పారిశుధ్య స్థితిగతులు, శనివారం సాయంత్రం వున్న స్థితిని స్వయంగా మంత్రి పర్యవేక్షించారు. పలుచోట్ల కాల్వల్లో వున్న పూడికను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు స్వయంగా తొలగించారు. మొదట డయేరియాకు కారణమైన నీరు కలుషితమైనట్లుగా గుర్తించిన బోరును పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఐదేళ్లుగా మా ప్రాంతాలను పట్టించుకోలేదు : మహిళల మొర**

టీడీపీ సానుభూతిపరులకు చెందిన కాలనీ అని ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని, మా ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల మహిళలు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో పారిశుధ్యం అనేది పట్టించుకోలేదని, వాటర్ ట్యాంక్‌ను ఒక్కసారి కూడా శుభ్రంచేసిన దాఖలాలు లేవన్నారు. అదేమని అడిగితే టీడీపీ వారంటూ నిందలు వేశారని మహిళలు పేర్కొన్నారు. యరపతినేని స్పందిస్తూ పారిశుధ్యానికి ఖర్చుచేయాల్సిన నిధులు కూడా నొక్కేయడం వల్ల ఇప్పుడు ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రస్తుతం డయేరియాను అదుపులోకి తెచ్చేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



లెనిన్‌నగర్ ఆసుపత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, అధికారులు



లెనిన్‌నగర్ కాల్వలో పూడికతీస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

## ప్రజల ఆరోగ్యానికే ప్రాధాన్యం

● అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

● అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 13: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరి నారాయణ స్పష్టం చేశారు. శనివారం పిడుగురాళ్ల ఆర్ అండ్‌బీ బంగ్లాలో మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం మెరుగుకు అన్ని చర్యలు చేపట్టామని, సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తగా అన్ని ప్రాంతాలలో మురుగుకాల్వల్లో పూడికతీత చేపట్టడంతో పాటు పరిశుభ్రమైన నీటిని అందిస్తామన్నారు. డయేరియా ప్రబలిన లెనిన్‌నగర్, మారుతీ నగర్‌లో 8 పవర్‌బోర్లు, 36 చేతిపంపులు వున్నట్లు గుర్తించామని, వాటిల్లో నీటిశాంపిల్స్‌ను సేకరించామన్నారు. కొన్ని బోర్లలో నీటికా లుష్యం వున్నట్లు గుర్తించడం వల్ల తాత్కాలికంగా ఆ బోర్ల వాడకాన్ని అధికారులు నిలిపివేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కూడా శనివారం ఉదయం పిడుగురాళ్లలో డయేరియా విషయంపై అధికారులతో రివ్యూ చేశారని, ఎమ్మెల్యే యరపతినేనితో కూడా ఆయన మాట్లాడారన్నారు. డయేరియాను అదుపుచేసేందుకు అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని, తక్షణమే రూ.10లక్షల నిధులు పారిశుధ్యానికి కేటాయించినట్లు మంత్రి వివరించారు. పిడుగురాళ్లలోని అన్ని కాల్వల్లో పూడికతీత చేపడతామని, అన్ని చేతిపంపుల్లో నీటి శాంపిల్స్‌ను తీసుకుంటున్నామన్నారు. కోనంకి గ్రామంలోనూ డయేరియా ప్రబలిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. అన్ని ప్రాం తాలలో పారిశుధ్యం మెరుగుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సమీక్షలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ రవి, తహసీల్దార్ శ్యాంసుందరరాజు, యరపతినేని నిఖిల్, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కమిషనర్ గిరికుమార్, ఏఈ రాఘవేంద్ర, పలు శాఖల అధికారులు, నాయకులు వున్నారు.



# పతనమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకోవాలి

● రూ.14లక్షల కోట్ల అప్పులు పెరిగాయి ● ఏపీ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ పి.వి.రమేష్



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13: రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో ఆర్థికవ్యవస్థ పతనమైందని, రూ.14లక్షల కోట్లకు అప్పులు పెరిగాయని రాష్ట్రప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేష్ పేర్కొన్నారు. శనివారం గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో "ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి కార్యాచరణ" అనే అంశంపై జరిగిన చర్చాగోష్టికి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా డాక్టర్ పి.వి.రమేష్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిరోజు రూ.75కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని, మరో రూ.175కోట్లు ప్రతిరోజు అప్పులు చేసే దుస్థితికి రాష్ట్ర ఆర్థికవ్యవస్థ దిగజారిందన్నారు. గత ప్రభుత్వం చట్టబద్ధ దోపిడీ చేస్తూ మోసపూరిత వ్యాపారసంస్థగా మారిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో 80శాతం ఉద్యోగులకు ఎలాంటి పని ఉండటం లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలు ప్రజలను కులాల ప్రాతిపదికగా విభజించి ఓట్లు పొందాలని భావిస్తున్నాయన్నారు. వ్యవసాయం, పారిశ్రామికరంగాలలో ఉత్పాదకతను పెంచి, దళారి వ్యవస్థను తొలగించాలన్నారు. మట్టి, ఇసుక, మైనింగ్ లాంటి సహజ వనరులను గత పాలకులు దోచుకుని అవినీతిని తారస్థాయికి తీసుకెళ్లారన్నారు. రాష్ట్రంలో ఒక్కశాతం జనాభా చేతిలో 44శాతం ఆస్తులు, 24శాతం ఆదాయం ఉందని, అట్టడుగున ఉన్న 50శాతం ప్రజలకు కేవలం 5 శాతం ఆస్తులే ఉన్నారన్నారు. ఇంకా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రామచంద్రరాజు, దళిత బహుజనఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, మానవతసంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, చైర్మన్ పావులూరి రమేష్, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, ఎం.కోటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, రమణబాబు తదితరులు ప్రసంగించారు.

# భారీఎత్తున పట్టుబడిన రేషన్ బియ్యం

● పరారైన మిల్లు యజమాని



మిల్లులో పట్టుబడిన లారీ వద్ద సీఎస్‌డీటీ పద్మజ, ఆర్ఐ శివ, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ, ఇతర నాయకులు

పట్టిచెరుకూరు, జూలై 13: మండలంలోని చమళ్లమూడి గ్రామంలో గల రైస్‌మిల్లులో శనివారం పీడీఎస్ రైస్ బ్యాగుల లోడు చేసిన 10 టైర్ల లారీని టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని సివిల్ సప్లయ్, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. లారీలోని పీడీఎస్ రైస్ బ్యాగులతో పాటు మిల్లులో ఉన్న రైస్‌ను బ్యాగుల్లో నింపుతున్నారు. ఆ సమయంలో మిల్లు యజమాని గుంటూరు నగరానికి చెందిన సుబ్బారావు పరారు కాగా వట్టిచెరుకూరు సీఐ ఉదయ్‌బాబు, ఎస్సై వినోద్‌బాబు, సిబ్బంది అతన్ని పట్టుకునేందుకు గుంటూరు వైపు వెళ్లారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చమళ్లమూడి మిల్లును కొనుగోలు చేసిన సుబ్బారావు ఈ ప్రాంతంలో పీడీఎస్ రైస్‌ను సేకరించి మిల్లుకు చేర్చి ఇక్కడ నుంచే పెద్దఎత్తున రవాణా చేస్తూ పెద్ద మాఫియాగా ఎదిగాడు. అతనికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల అండ పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా పీడీఎస్ రైస్‌ను తరలించేవాడు. పలుమార్లు స్వల్ప మొత్తంలో పీడీఎస్ రైస్ రవాణాకి సిద్ధంగా ఉన్న సమయంలో గ్రామస్థుల సమాచారంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేసి రైస్ లారీలను పట్టుకొన్నారు. అయితే తుతుమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి. ఆ మిల్లు జోలికెళితే ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు వస్తుందోనని అధికారులు, ఎక్కడ కేసులు పెట్టి వేధిస్తారోనని గ్రామస్తులు మిన్నకుండిపోయారు. గత కొద్ది రోజులుగా రైసుమిల్లుపై టీడీపీ నాయకులు నిఘా పెట్టి రవాణాకు సిద్ధంగా ఉన్న లారీలు మిల్లు ప్రాంగణంలో ఉండటంతో టీడీపీ మండల అధ్యక్షులు పూర్ణచంద్రరావు సివిల్ సప్లయ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానికి సమాచారం ఇచ్చారు. మన్నవ పూర్ణచంద్రరావుతో పాటు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు లక్ష్మయ్య, గ్రామపార్టీ అధ్యక్షులు అంకపూడి మురళి, కాట్రపాడు పార్టీ అధ్యక్షులు సాంబశివరావు, యువత అధ్యక్షులు ఎన్ నాగరాజు, మన్నవ గోపిలు ఉండగా సివిల్ సప్లయ్ డీటీ పద్మజ, ఆర్ఐ శివ, సీఐ ఉదయ్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు, సిబ్బంది రైస్ మిల్లు వద్దనే ఉండి మిల్లులోని బావుల్లో ఉన్న బియ్యాన్ని బ్యాగులకు ఎత్తిస్తూ మొత్తం స్టాకును ఎక్కించే పనిలో పడ్డారు.



ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న కళాదర్బార్ సభ్యులు, పాల్గొన్న టీడీ జనార్ధన్ తదితరులు

# వేడుకగా ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), జూలై 13: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుక సందర్భంగా కళాదర్బార్- అమరావతి వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులకు ఎన్టీఆర్ ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం శనివారం వేడుకగా జరిగింది. తొలుత ఏర్పాటుచేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఎన్టీఆర్ నటించిన పాటలను గాయనీగాయకులు శైలజ, సౌజన్య, పావని, రసూల్‌బాబు, సుధీర్‌బాబు, హరికిషన్, ప్రవీణ్‌కుమార్ ఆలపించారు. అనంతరం విచ్చేసిన అతిథులు, ప్రజాప్రతినిధులు ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, అడ్వకేట్ టీడీపీ అధికార ప్రతినిధి రామకృష్ణ ప్రసాదు, ప్రముఖ నిర్మాత ఆర్ వెంకటేశ్వరరావు, ముప్ప ప్రైవేట్ లిమిటెడ్ వెంకయ్య చౌదరి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహమ్మద్ నసీర్, డాక్టర్ సీహెచ్ అరవిందబాబులకు ఎన్టీఆర్ ప్రతిభ పురస్కారాలను అతిథుల చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పంచుమర్తి కల్పన, మేకల రవీంద్రబాబు, గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రాసమణి కుమార్ వ్యవహరించారు.

# ముగ్గురు అధికారులకు నోటీసులు

**విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ నియామకం**


గుంటూరు(కార్పొరేషన్), జూలై 13: నగరపాలక సంస్థకు చెందిన ట్రావెలింగ్ బంగ్లాలో వైసీపీ ప్రచారసామగ్రి ఉంచటంపై కమిషనర్ కీర్తి చేకూరి స్పందించారు. ఎన్నికల ముందు ప్రభుత్వ కార్యాలయంలో సామగ్రి ఉంచటంపై నివేదిక ఇవ్వాలని విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ను ఆమె ఆదేశించారు. ట్రావెలింగ్ బంగ్లాలో వైసీపీ ప్రచారసామగ్రి ఉంచి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న బంగ్లా ఇన్‌చార్జి నాగేశ్వరరావు, ఏఈ రాంబాబు, డీఈఈ రమేష్‌బాబులకు షోకాజ్ నోటీసు జారీచేశారు. కార్పొరేషన్‌కు చెందిన కొందరు అధికారులు వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ ప్రచారసామగ్రిని ప్రభుత్వ కార్యాలయంలో నిల్వ ఉంచారు. దీనిపై స్పందించిన కమిషనర్ విచారణకు ఆదేశించారు.

## పేరేచర్ల-ఫిరంగిపురం మధ్యన ఎల్‌సీ గేటు తాత్కాలికంగా మూసివేత

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్యన ఉన్న లెవల్‌క్రాసింగ్ గేటు నెం.298కి అత్యవసర మరమ్మతుల నిమిత్తం మూసివేశామని డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. ఈ నెల 14వ తేదీ రాత్రి 8గంటల వరకు ఈ గేటు మూసివేసి ఉంటుందన్నారు. వాహనదారులు, పాదచారులు ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

# పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కులు

● బ్యారేజి వద్ద నీటి మట్టం 12 అడుగులు



పశ్చిమ కెనాల్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

తాడేపల్లి టౌన్, జూలై 13: ప్రకాశం బ్యారేజి హెడ్ రెగ్యులేటర్ నుంచి కాలువలకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. బ్యారేజి ఎగువన వాగుల నుండి 1000 క్యూసెక్కుల వరద నీరు, పట్టిసీమ నుండి 5300 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందని నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం నమోదవుతోందని, పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు దినేష్ తెలిపారు.

# సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), జూలై 13: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఏ సాయివెంకటధీరజ్ 435 మార్కులు, ఎన్.శృతిహర్షత 360, కె.బాలచందర్ 332, జె.ప్రియకుమారి 326, డి.లక్ష్మీనరసింహా 322, కె.దుర్గా 315 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ లక్ష్మీ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో అన్నా నందకిషోర్ తదితరులు

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 119, 127, 137 |
| చికెన్ విత్ స్కిన్ | 226.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 236.00 |

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

## బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా నిర్మల్‌కుమార్


బాధ్యతలు చేపడుతున్న వి.నిర్మల్‌కుమార్

బాపట్ల, జూలై 13 : బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా వి.నిర్మల్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇక్కడ బాధ్యతలు చేపట్టిన కమిషనర్ బి.శ్రీకాంత్‌ను తాడేపల్లి ఉప కమిషనర్‌గా బదిలీ చేసి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తున్న నిర్మల్‌కుమార్‌ను బాపట్లకు బదిలీ చేశారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి బాపట్ల పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్‌లో ఉన్న నీటి పరిమాణాన్ని పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు. కమిషనర్‌ను పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

## జీపీఎస్ గజిట్‌ను రద్దు చేయాలి : యూటీఎఫ్

బాపట్ల, జూలై 13 : వైసీపీ ప్రభుత్వంలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని దాని స్థానంలో తీసుకొచ్చిన జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గజిట్ విడుదల చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడా వినయ్‌కుమార్, అడుగుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈవిషయమై శనివారం పాతబస్టాండ్ సెంటర్‌లో గజిట్ పత్రాలను ప్రదర్శించి వాటిని చించి దహనం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 54 జీవో, జీపీఎస్ గజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మచ్చా వెంకటేశ్వరరెడ్డి, మద్దాల సురేష్, తటవర్తి సుబ్బారావు, చక్రధర్, నన్నేరయ్య, శ్రీనివాసరావు, బాబూజీరెడ్డి, రవికాంత్ పాల్గొన్నారు.

### గజిట్ విడుదలపై ఉపాధ్యాయ సంఘాల సమైక్య ఖండన

వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ పెన్షన్ పథకం గజిట్ విడుదలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సమైక్య జిల్లా శాఖ పేర్కొంది. ఈవిషయమై శనివారం వారు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో తీసుకొచ్చిన జీపీఎస్‌కు సంబంధించిన ఫైల్‌పై గత నెల 12వ తేదీన అప్పటి ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సంతకం చేయటం జరిగిందన్నారు. జీవో 54ను అప్పుడు విడుదల చేయగా నేడు గజిట్‌లో అప్‌లోడ్ చేయటం సరికాదన్నారు. నోటిఫికేషన్ రద్దు చేయాలని ఛైర్మన్ బడుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ టీవీ సురేష్ డిమాండ్ చేశారు.

## హేతువాద మానవవాద ఉద్యమం అత్యవసరం

### భారత హేతువాద సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ గుమ్మా వీరన్న


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గుమ్మా వీరన్న

బాపట్ల, జూలై 13 : హేతువాద, మానవవాద ఉద్యమం అత్యవసరమని భారత హేతువాద సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ గుమ్మా వీరన్న అన్నారు. బాపట్ల ఎన్జీవోహోమ్‌లో శనివారం భారతహేతువాద సంఘ 93వ వార్షిక మహాసభలు ప్రారంభించారు. ప్రారంభ సభకు డాక్టర్ వీరన్న అధ్యక్షత వహించి మాట్లాడుతూ మూఢవిశ్వాసాలతో ప్రజలు ఉన్నందు వల్ల సక్రమంగా ఆలోచించలేకున్నారన్నారు. కుల,మత రాజకీయాలు-సెక్యూలరిజం అంశం మీద ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ సహాయ కార్యదర్శి సింహాద్రి యలమందరెడ్డి మాట్లాడుతూ కుల,మత రాజకీయాల వల్ల ప్రజాస్వామ్యం పతనమౌతుందన్నారు. భారతహేతువాద సంఘ వైస్‌ఛైర్మన్ శ్రీనిపట్టతానం మాట్లాడుతూ మతవిశ్వాసాలను ప్రభుత్వం పెంచి పోషించటం సెక్యూలరిజం కాదన్నారు. కేరళ హేతువాద సంఘంనాయకులు కేపిజార్జ్ మాట్లాడుతూ కుల, మతాలు, రాజకీయాలు కలవటం వల్ల ఫాసిజం నియంతృత్వం అమలౌతుందన్నారు. కేరళహేతువాద సంఘం ఉపాధ్యక్షులు కెయు సదానందం మాట్లాడుతూ కుల, మతాలు వల్ల ప్రజాస్వామ్యం పతనమౌతుందన్నారు. భారతహేతువాద సంఘ ఇంగ్లీష్ బులిటన్ నెంబరు 11ను విశ్రాంత ప్రొఫెసర్ జె.లక్ష్మారెడ్డి సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, సహాయ కార్యదర్శి కిషోర్ బాచిన, డి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భావవిప్లవం గ్రంథాన్ని ఆవిష్కరించారు.

## ఘనంగా గుండ్రెడ్డి శివ జన్మదినవేడుకలు


శివకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, కర్లపాలెం, జూలై 13 : జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డిశివ జన్మదిన వేడుకలను శనివారం బాపట్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆయనకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, చెన్నుపాటి కిషోర్, నాగరాజు తదితరులు ఉన్నారు. చీలురోడ్డు సెంటర్‌లో మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్ ఆధ్వర్యంలో భారీ కేక్ ఏర్పాటు చేయగా గుండ్రెడ్డి శివ కట్ చేశారు. కారు ట్రావెల్స్ అసోసియేషన్ నాయకులు వినోద్‌కుమార్, పి.కిషోర్, సతీష్‌సాయి, యాసిన్, పి.ప్రసాద్, పి.ప్రవీణ్, యలమంద, శ్రీను బాణాసంచా కాల్చి శివకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అంటరానితన నిర్మూలన పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, మాలమహానాడు రాష్ట్రనాయకులు శీలం రోజన్‌బాబు, మంచాల ఆనంద్‌కుమార్, రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆర్మీ రవి, తూనుగుంట్ల లలితబాబు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, దామర్ల సూర్యనారాయణలు శివకు పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.


శివకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఇక్కుర్తి శ్రీనివాసరావు

## ఆర్మ్‌స్ట్రాంగ్ మృతికి ఘననివాళి

బాపట్ల, జూలై 13 : తమిళనాడు రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ మృతికి బాపట్ల నాయకులు ఘన నివాళులర్పించారు. బాపట్ల మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆర్మ్‌స్ట్రాంగ్ పటానికి జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు పార్టీశ్రేణులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, వీకేసీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగులగడ్డ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్ గోపి

బాపట్ల, జూలై 13 : బాపట్ల జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. రాష్ట్ర విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవ్, రాష్ట్ర కోశాధికారి షేక్ సుభానీలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికలో బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా నర్రా సురేష్‌గోపియాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చిప్పల సుదర్శనరావు, కోశాధికారిగా కోట రాజ్యలక్ష్మి తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు. బాపట్ల ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


వ్యవసాయ విస్తరణాధికారుల నూతన కార్యవర్గం

## ఈదులమ్మ తల్లికి పూజలు

నగరం, జూలై 13 : మండలంలోని గ్రామాల్లో పాడిపంటలు, సుఖసంతోషాలతో ప్రజలు ఉండాలని ఈదులమ్మ తల్లి అమ్మవారిని శనివారం ఇంటింటికి తిప్పుతూ ఊరేగింపుగా కొలుపులు కొలిచారు. ఈ సందర్భంగా ఈవో రాజేశ్వరమ్మ మాట్లాడుతూ ఈదులమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవంలో భాగంగా కొలుపులు ప్రారంభమయ్యాయని, గ్రామంలోని ఇంటింటికి తిప్పుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలు సుభిక్షంగా ఉండాలంటే ఆషాఢమాసంలో గ్రామదేవతలకు తప్పనిసరిగా పూజలు నిర్వహించాలని అప్పుడే ఆ గ్రామం అన్ని రకాలుగా ముందుంటుందని తెలిపారు.


కర్లపాలెంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల వద్ద చెరువులను తలపిస్తున్న పొలాలు


రేపల్లె బస్టాండ్‌రోడ్డులో ఈదురుగాలులకు నేలవాలిన భారీ వృక్షం

# భారీ వర్షంతో రైతుల ఆందోళన

బాపట్ల, జూలై 13 : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో కురిసిన భారీ వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు పొలాలలో వెదపెట్టటం, వరినారుమడులు పోయటం ప్రారంభించారు. ఫామ్‌పాండ్‌లోని నీటితో సాగును ప్రారంభించిన రైతులకు శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో రైతు లు భయపడుతున్నారు. వర్షం వల్ల వెదపెట్టిన పొలాలలో నీరు నిలిచింది. నారుమడులలో నిలిచిన నీరు వల్ల విత్తనాలు కుళ్ళిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటిని బయటకు పంపించి విత్తనాలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలోని కర్లపాలెం మండలంలో అత్యధికంగా 90.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా పిట్టలవానిపాలెం మండలంలో 26.4 మిల్లీమీటర్లు, బాపట్ల మండలంలో 18.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆకుకూరలు, కూరగాయల తోటలలో కూడా వర్షపునీరు నిలిచింది. శనివారం ఉదయం నుంచి కూడా వర్షపుజల్లులు పడుతున్నాయి. వర్షం ఆగితే రైతులకు నష్టం జరగదు. ఇంకా కురిస్తే వెదపెట్టిన పొలాలు, నారుమడులలోని విత్తనాలు కుళ్ళిపోయే ప్రమాదం ఉంది.


వర్షంతో కర్లపాలెంలో కూరగాయల తోటలలో నిలిచిన వర్షపునీరు

### నేలకూలిన భారీ వృక్షాలు


బసవేశ్వర థియేటర్ పక్కరోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రేపల్లె, జూలై 13 : తీరప్రాంతంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం పడటంతో రహదారులన్నీ జలమయమై భారీ వృక్షాలు నేలవాలాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రేపల్లె బస్టాండ్ రోడ్డులో రైల్వే ఆవరణలో ఉన్న భారీ వృక్షం నేలవాలటంతో రైల్వే ప్రహరీ ధ్వంసమై ప్రధాన రహదారిపై పడింది. ఆసమయంలో ప్రయాణికులు ఎవరూ వెళ్ళకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఎడతెరిపి లేని వర్షం కురవటంతో పాత స్టేట్‌బ్యాంకురోడ్డు, బసవేశ్వరథియేటర్ రోడ్డు, కృష్ణాటాకీస్‌రోడ్డు ప్రక్కరోడ్డు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జగనన్న కాలనీలో రహదారుల చుట్టూ నీరు నిలిచి బురదమయంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే పట్టణంలో ప్రధాన రహదారులన్నీ వర్షపు నీరు పోయే మార్గం లేక రోడ్డుపైనే నిలవటంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. మున్సిపల్ అధికారులు ప్రతి సంవత్సరం డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగిస్తున్నామంటూ లక్షలాది రూపాయలు బిల్లులుచేసుకుంటున్నారే తప్పా పూర్తిస్థాయిలో పూడికలు తీసిన దాఖలాలు లేవు. అటు అధికారులు, ఇటు పాలకులు కుమ్మక్కై లక్షలాది రూపాయలు దోచుకుంటూ డ్రెయిన్‌లో పూడికలు తీసిన దాఖలాలు లేవు. దీంతో రహదారులపై విపరీతంగా నీరు నిలుస్తున్నాయంటూ పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. వర్షంపడటంతో హడావుడిగా మున్సిపల్ సిబ్బంది ప్రధాన డ్రెయిన్లలో నామమాత్రంగా పూడికలు తీసే పని ప్రారంభించారు. నూతన ప్రభుత్వంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టణంలో నెలకొన్న మౌలిక సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. రేపల్లె పట్టణంలో 38.6మి.మీ, నిజాంపట్నం మండలంలో 30.4మి.మీ. నగరం మండలంలో 36.4మి.మీటర్లు, చెరుకుపల్లి మండలంలో అత్యధికంగా 63.4మి.మీటర్లు వర్షపాతం నమోదైంది.

### చెరువులుగా మారిన పొలాలు

కర్లపాలెం, జూలై 13 : కర్లపాలెం మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షం కారణంగా పొలాలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కర్లపాలెం, దండుబాటు, ఎంవి.రాజుపాలెం, గణపవరం, చింతాయపాలెం, నక్కలవారిపాలెం గ్రామాలలోని పలు రహదార్లు జలమయమయ్యాయి. వర్షం కారణంగా రహదారిపై గుంతలలో వర్షపునీరు నిలవటంతో ప్రయాణికులు రాకపోకలు జరిపేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్లపాలెంలోని రాజులపాలెంలో వర్షం కారణంగా వీచిన గాలులకు విద్యుత్‌లైన్‌లు తెగి రోడ్డు మీదపడ్డాయి.

### జలమయమైన లోతట్టు ప్రాంతాలు

భట్టిప్రోలు, జులై 13 : మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షం ధాటికి పలు గ్రామాల్లో వృక్షాలు నేలవాలాయి. మండలంలోని ఐలవరం గ్రామ దళితవాడలో భారీ వృక్షం రేకుల ఇంటిపై పడడంతో ఇల్లు పూర్తిగా నేలవాలింది. ఖరీఫ్ సీజన్‌ను పురస్కరించుకుని మాగాణి భూముల్లో వరి సాగుకు సన్నద్ధమైన రైతాంగం శనివారం కురిసిన భారీ వర్షానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎద పద్ధతిలో సాగు చేసిన వరికి వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతాంగం తెలిపారు.


ఐలవరంలో చెట్టుపడి కూలిన రేకుల ఇల్లు

### విద్యుత్ తీగలపై పడిన తాడిచెట్లు

పిట్టలవానిపాలెం, జూలై 13 : మండల కేంద్రంలోని పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదురుగా శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట పొలాలలో ఉన్న తాడిచెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. పిట్టలవానిపాలెం మండల విద్యుత్ శాఖ ఏఈ కె.చంద్రశేఖర్ తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన తెగిపడిన విద్యుత్ లైన్‌లను తమ సిబ్బందితో కలిసి మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.


వర్షానికి నేలవాలిన తాడిచెట్లు


ఘంటసాల విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర్లురెడ్డి

## అమరావతి అభివృద్ధి వైపు ప్రతి ఒక్కరి చూపు : కోట

బాపట్ల, జూలై 13 : ఆంధ్ర నుంచి అమెరికా వరకు నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధి వైపు ప్రతి ఒక్కరు చూస్తున్నారని ఊరూరా జనవిజ్ఞానం అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. బాపట్ల మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటించి రాష్ట్రాభివృద్ధిపై మొదటినెల సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి కోట వెంకటేశ్వర్లురెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రగతి కోసం ప్రజాచైతన్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ వడ్లకొండ శ్రావణ్, సభ్యులు గురజాల శ్రీనివాసరావు, జీవీ బ్రహ్మం, సూర్యనారాయణ గుప్తా, ప్రసన్నాంజనేయులు, ఉపేంద్రగుప్తా, శ్రీనివాసరావు, ఏలూరి హరిబాబు, గోపరాజు రామచంద్రరావు, సుబ్బారావు, సారధి, రత్తయ్య, రమేష్, ఉషారాణి, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

బాపట్ల, జూలై 13 : మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు. స్థానిక విజయలక్ష్మీపురంలోని మాజీ సైనిక సంక్షేమసంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌బిఐ ద్వారా మాజీ సైనికులకు అందించే సేవలపై కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈసమావేశంలో ఉపాధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, సెక్రటరి సయ్యద్ అఖిల్, కోశాధికారి పువ్వాడ యలమంద, ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, అబ్దుల్ రజాక్, యేమినేని సురేంద్ర, ఎం.శ్రీనివాసరావు, ఎం.వీరాస్వామి, డి.వెంకటేశ్వర్లు, ఎల్‌వి.నరసింహారావు, పసుపులేటి ప్రసాద్, మున్నం కోటేశ్వరరెడ్డి, రుక్మదరావుపాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు

## సొంత ఖర్చులతో రైతులు కాల్వల్లో పూడికతీత

● నీరు పారుదలకు తొలగిన ఇబ్బందులు

చుండూరు, జూలై 13 : మండలంలో పంట కాల్వల్లో పూడిక తీత పనులకు రైతాంగం నడుం బిగించారు. చుండూరు-పెదగాదెలవర్రు మార్గంలో ఉన్న పంట కాల్వల్లో కొన్ని సంవత్సరాలుగా పూడిక తీత పనులు లేక సాగునీరు, మురుగునీరు పారుదలకు ఇబ్బందిగా మారింది. దీంతో రైతులే ఉమ్మడిగా సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడికతీత పనులు చేపట్టారు. దీంతో ఈ కాల్వ కింద 500 ఎకరాల్లో భూములకు సాగునీరు, మురుగునీరు పారుదలకు ఇబ్బంది లేకుండా అవకాశం ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు.


ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయిస్తున్న రైతులు

## టీడీపీ నాయకుడు అబ్దుల్‌ఖాదర్ జిలానీ మృతి


అబ్దుల్‌ఖాదర్ జిలానీ (ఫైల్)

పిట్టలవానిపాలెం, జూలై 13 : తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు, పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్‌ఖాదర్ జిలానీ (46) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీకి చెందిన షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీకి భార్య, ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. ఈయన 2014-2019 వరకు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. చందోలు గ్రామ, మండల టీడీపీ నాయకులు, గ్రామస్తులు ఆయన స్వగృహానికి విచ్చేసి అబ్దుల్ ఖాదర్ జిలానీ పార్థివదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు అబ్దుల్‌ఖాదర్ జిలానీ కుటుంబ సభ్యులకు తమప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

## బైక్‌లు ఢీకొని డిప్యూటీ మేనేజర్‌కు గాయాలు

బాపట్ల, జూలై 13 : బాపట్ల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్న రవీంద్ర బైక్‌పై గుంటూరు నుంచి వస్తుండగా చీలురోడ్డు సెంటర్‌లో కర్లపాలెం వైపు నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో రవీంద్రకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ యు.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## వెదకు ఇబ్బందిగా మారిన అధిక వర్షం


పంట భూముల్లో నిలిచిన వర్షపు నీరు

చుండూరు జులై 13 : మండలంలో వెదపద్ధతిలో సాగు చేస్తున్న రైతాంగానికి శుక్రవారం కురిసిన అధిక వర్షం ఇబ్బందికరంగా మారింది. వెద సాగు భూముల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో వేసిన విత్తనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెద సాగుకు ఇప్పటికే రైతాంగం రెండు సార్లు దుక్కులు, రోటోవేటర్‌కు, వెదకు, విత్తనాలకు, కలుపు మందులకుగాను రూ.10 వేల వరకు ఖర్చు చేశారు. మరికొద్ది రోజులు వర్షపు నీరు పంట భూముల్లో నిల్వ ఉంటే మొలకదెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాల్వల్లో పేరుకుపోయిన పూడికతీతలను వెంటనే తొలగించాలని రైతాంగం కోరుతున్నారు.

### కొల్లూరులో...


వర్షపు నీటిలో మునిగిన వెదపద్ధతిలో వేసిన వరి పైరు

కొల్లూరు, జూలై 13 : శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షానికి వెద పద్దతి వరి పంట నీట మునిగింది. మండల కేంద్రం కొల్లూరుతో పాటు మండల గ్రామాల్లోని మాగాణి భూముల్లో విత్తుకున్న వెద పద్దతి వరి సాగు, శాస్త్రీయ పద్దతిలో వేసిన వరి నారుమళ్ల సైతం వర్షపు నీటి బారిన పడ్డాయి. మెట్ట భూముల్లో సాగు చేస్తున్న వాణిజ్య పంటలకు వర్షం దోహదపడింది. వర్షం వల్ల మురుగు కాల్వల్లో మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లాయి. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

## బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు పంపిణీ

భట్టిప్రోలు, జూలై 13 : ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ఇంటిపై చెట్టు పడడంతో మండలంలోని ఐలవరం గ్రామంలో రేకుల ఇల్లు నేలవాలింది. మునిపల్లి నాగేంద్రంకు చెందిన ఇల్లు పూర్తిగా నేలవాలడంతో కుటుంబం కట్టుబట్టలతో రోడ్డుపై నిలిచింది. వీఆర్‌ఓ రత్నాకరరావు తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులను అందించగా గ్రామ టీడీపీ నాయకులు బాధిత కుటుంబానికి శనివారం పంపిణీ చేసి భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూరపాటి రఘురామయ్య, జొన్నాదుల వెంకటేశ్వరరావు, మాచర్ల సత్యనారాయణ, అత్తలూరి శంకర్, అడిగోపుల శ్రీనివాసరావు, వెంకట్రాపు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం


శ్యామ్‌సుందర్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న గంగాధర్

అమృతలూరు, జూలై 13 : మండల పరిధిలోని పాంచాళవరం గ్రామానికి చెందిన పులివర్తి శ్యాంసుందర్‌కు టీడీపీ నాయకుడు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా వైసీపీ కార్యకర్తలు పులివర్తి శ్యాంసుందర్‌కు చెందిన బార్బర్ షాపును తగలబెట్టారు. ఈ నేపథ్యంలో షాపు మరమ్మతులు చేసుకునే నిమిత్తం 10 వేల రూపాయలను పార్టీ నాయకుడు గొట్టిపాటి గంగాధర్ ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు మెంబర్ బాజీ, చిలువోల్లంక చంద్రం, కాలేషా, ఆలపాటి రాజేష్, మౌలాలి, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్డ్ సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావుకు డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకున్న మధిర శ్రీనివాసరావు

వేమూరు, జూలై 13 : కార్డ్ సంస్థలో రీజనల్ కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్న మధిర శ్రీనివాసరావుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డాక్టర్ ప్రదానం చేసింది. ఫిరంగిపురంలో శనివారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వివిధ విభాగాల్లో సేవలందించేటువంటి ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు అందించిందని, అందులో భాగంగా తనకు ఈ అవకాశం దక్కినట్లు మధిర శ్రీనివాసరావు తెలియజేశారు. కార్డ్ సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.


## అధ్వానంగా తయారైన బూతుమల్లి రోడ్డు మార్గం


అధ్వానంగా తయారైన బూతుమల్లి రోడ్డు మార్గం

వేమూరు, జూలై 13 : మండలంలోని బూతుమల్లి గ్రామానికి వెళ్ళే మార్గం అధ్వానంగా తయారైంది. తెనాలి-వేమూరు ప్రధాన రహదారిలోని బూతుమల్లి కాలువ నుంచి గ్రామంలోకి వెళ్ళేందుకు రెండు కిలో మీటర్ల రోడ్డు మార్గం ఉంది. ఈ మార్గం పూర్తిగా దెబ్బతిని గుంతలమయం అయ్యింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్ళేందుకు కష్టతరంగా మారింది. దీంతో గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్ళాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోకి కనీసం ఆటోలు కూడా రావడం లేదు. ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్డు మార్గాన్ని సుగమం చేసి సహకరించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




## అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

## రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.


## మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా



నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్ల తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు. లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్టు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్వ, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.


హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)














రిజర్వాయర్‌గా మార్చాల్సిన భవనాసి చెరువు.. గుండ్లకమ్మ నీటిని భవనాసి రిజర్వాయర్‌కు మళ్లించేందుకు తవ్వి ఆగిన కాలువ పనులు

# భవనాసి రిజర్వాయర్ ఎప్పటికి పూర్తయ్యేనో..?

- 15 ఏళ్లుగా సాగుతున్న పనులు
- భూసేకరణ, బ్లాస్టింగే ప్రధాన అడ్డంకి
- మంత్రి రవికుమార్‌పైనే రైతుల ఆశలు

అద్దంకి, జూలై 13 : అద్దంకి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ భవనాసి రిజర్వాయర్. 106 సంవత్సరాల కిందట భవనాసి చెరువు నిర్మాణం జరగ్గా, రిజర్వాయర్‌గా చేసే పనుల నిమిత్తం సుమారు రూ.27కోట్లతో 2009లో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అప్పటి గుంటూరు జిల్లా ప్రస్తుత పల్నాడు జిల్లా పరిధిలోని గోకనకొండ సమీపంలో గుండ్లకమ్మ నదికి అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం చేసి అక్కడ నుంచి సుమారు 12 కి.మీ దూరం నేలకాలువ ద్వారా నీటిని భవనాసి చెరువును నింపాల్సి ఉంది. అదేసమయంలో భవనాసి చెరువు పటిష్టం చేసి అలుగు ఎత్తు పెంచటం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెంచాల్సి ఉంది. ఈక్రమంలో గుండ్లకమ్మ నదిలో చెక్ డ్యామ్ నిర్మాణ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయి. భవనాసి చెరువు కట్ట అభివృద్ధి చేసే పనులు కూడా పూర్తయ్యాయి.

గుండ్లకమ్మ నది నుంచి భవనాసి చెరువు వరకు కాలువ తవ్వకం పనులు కొంతమేర పూర్తయినా పలు చోట్ల అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రధానంగా కొన్నిచోట్ల భూసేకరణ జరగకపోవడంతో పాటు మైలవరం, ఉప్పలపాడు సమీపంలో కాలువ తవ్వకం సమయంలో పెద్ద రాళ్లు పడ్డాయి. వాటిని పగులగొట్టడానికి బ్లాస్టింగ్ చేయాల్సి ఉంది. బ్లాస్టింగ్‌కు అనుమతులు రాకపోవడం, ఆయా గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యకం కావడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. భవనాసి చెరువులో ఆక్రమణలు తొలగింపు, భూసేకరణ కూడా జరగాల్సి ఉంది.

ఈనేపథ్యంలో భూసేకరణ వ్యవయం, కాలువ తవ్వకం వ్యయం పెరగడంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు వ్యయాన్ని రూ.45 కోట్లకు పెంచారు. దీంతో కొద్ది రోజులు పనులు హడావుడి చేసినా మరలా ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గత ఏడెనిమిది సంవత్సరాల నుంచి ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భవనాసి రిజర్వాయర్ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, శంకుస్థాపన చేసినప్పటి నుంచి నేటి వరకు అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి దక్కడంతో మధ్యలో నిలిచిపోయిన భవనాసి రిజర్వాయర్ పనులు పునఃప్రారంభమై వేగవంతంగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. భవనాసి రిజర్వాయర్ పూర్తయితే ప్రస్తుతం ఉన్న రెండు వేల ఎకరాల ఆయకట్టుతో పాటు శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ఆయకట్టులో ఉన్న సుమారు నాలుగు వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో ఏడాది పొడవునా నీటి లభ్యత ఏర్పడనుంది. సాగర్ ఆయకట్టు చివరిప్రాంతమైన పమిడిపాడు మేజర్ ఆయకట్టు లోని అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాల పరిధిలోని సుమారు పది వేల ఎకరాలకు సాగునీటి భరోసా కలగనుంది. అదే సమయంలో పలు గ్రామాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కూడా కలుగనుంది. ఇప్పటికైనా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి భవనాసి రిజర్వాయర్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అద్దంకి ప్రాంత రైతులు కోరుతున్నారు.



బోర్‌ను తీస్తున్న సిబ్బంది

## ముక్తేశ్వరంలో రెండు బోర్లు ఏర్పాటు

బల్లికురవ, జూలై 13 : మండలంలోని ముక్తేశ్వరంలో ప్రజల తాగు నీటి అవసరాలకు గ్రామ పంచాయతీ నిధులతో శనివారం రెండు బోర్లను వేశారు. గురువారం ఆంధ్రజ్యోతితో ముక్తేశ్వరంలో దాహం కేకలు అన్న కథనం ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు గ్రామాన్ని సందర్శించి నీటి సమస్య అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పంచాయతీ నిధులతో బోర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. నీరు లేక ఎండి పోయిన గిలకల బావి వద్ద, రామాలయం సమీపంలో రెండు బోర్లను తీస్తున్నారు. బోర్లకు చేతి పంపులను ఏర్పాటు చేయనున్నారు. గ్రామంలో మరో అయిదు చేతి పంపులను ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీటి ఎద్దడి రాకుండా చూడాలని, మహల్ బావిలో పూడిక తీయించాలని, పైపు లైన్ ద్వారా గ్రామంలోకి నీటిని సరఫరా చేయాలని కోరారు.



కొండయ్య దంపతులను అభినందిస్తున్న ప్రముఖులు

## వైజాగ్‌లో కొండయ్యకు ఘన సన్మానం

చీరాల, జూలై 13 : ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆయన సతీమణి బాలకొండమ్మను శనివారం విశాఖ పోర్టు కళావాణీ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. ఆర్‌కే టౌన్ షిప్ అధినేతగా 1995 నుంచి కొండయ్య వైజాగ్ ప్రాంతానికి సుపరిచితులు. తరువాత విద్యా సంస్థల నిర్వహణలో ఆయనకు ప్రత్యేకత ఉంది. ఈ క్రమంలో గత ఎన్నికలకు సుమారు రెండు సంవత్సరాల ముందు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొండయ్య చీరాల నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు తీసుకున్నారు. తనదైన శైలిలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ శ్రేణులకు సమన్వయం చేసుకుంటూ, 2024 ఎన్నికలలో గెలుపొందారు. ఈ క్రమంలో కొండయ్య దంపతులు వైజాగ్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆయనకు పురప్రముఖులు, ఆర్‌కే సంస్థల ప్రతినిధులు, కూటమి శ్రేణులు, శ్రేయోభిలాషులు వరుస క్రమంలో కొండయ్య దంపతులను సన్మానిస్తూ, శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వ్యాపారవేత్తగా, రాజకీయనాయకునిగా విస్తృత పరిచయాలు ఉండడం, సేవా కార్యక్రమాల్లో ముందుండడం అందుకు కారణం. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పెద కుమారుడు గౌరీఅమర్‌నాథ్, ఆర్‌కే టౌన్‌షిప్ సంస్థల పర్యవేక్షణ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, పలువురు పురప్రముఖులు పాల్గొన్నారు.

## ఊడిన ఆర్టీసీ బస్సు చక్రం

**తప్పిన ప్రమాదం**



చక్రం ఊడిన బస్సును పరిశీలిస్తున్న డిపో మేనేజర్ శ్యామల

చీరాలటౌన్, జూలై 13 : చీరాల పట్టణంలో అకస్మాత్తుగా ప్రయాణికులు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు నుంచి చక్రం అకస్మాత్తుగా ఊడింది. ఈఘటన శనివారం సాయంత్రం చీరాల ముంతావారి సెంటర్‌లో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ఇంకొల్లు నుంచి చీరాలకు సుమారు 20 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్ బయలుదేరింది. ఈనేపథ్యంలో సాల్మన్ సెంటర్ వద్దకు రాగానే బస్ నుంచి ప్రతికూల శబ్దంను అప్పటికే డ్రైవర్ ఈశ్వర్‌రెడ్డి గమనించారు. అలాగే చిన్నగా వస్తుండగా ముంతావారి సెంటర్‌కు రాగానే ఒక్కసారిగా హబ్ విరిగి చక్రం బస్ నుంచి పూర్తిగా ఊడిపోయి పక్కకు వెళ్లింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ జాగ్రత్తగా బస్‌ను నిలిపివేశాడు. అయితే ప్రయాణికులు భీతిల్లిపోయారు. సమాచారం అందుకున్న డిపో మేనేజర్ శ్యామల సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సిబ్బందితో మరమ్మతులు చేపట్టి బస్‌ను డిపోకు తరలించారు. అయితే ప్రయాణికులు క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రావూరు - తిమ్మసముద్రం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో బస్సులు దెబ్బతింటున్నాయని ఈక్రమంలోనే ప్రమాదం జరిగి ఉంటుందని ఆర్టీసీ సిబ్బంది చెప్తున్నారు.

## ఆదమరిస్తే అంతే..!

**- బొమ్మల సెంటర్ కూడలిలో ప్రమాదంగా కుంట**

**- పట్టించుకోని అధికారులు**

పర్చూరు, జూలై 13 : పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో మురుగు కాలువ మరమ్మతులకు తీసిన కుంట ప్రమాదకరంగా మారింది. డ్రైనేజ్ కాలువ మరమ్మతులు చేపట్టిన అధికారులు కుంట వద్ద ఎలాంటి ప్రమాద సూచికలను ఏర్పాటు చేయలేదు. పోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న ప్రధాన రహదారి వెంబడి కాలువపై కుంటను ఏర్పాటు చేసి ఉండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తుంది. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. గ్రామంలోకి వెళ్లే మలుపులో ప్రమాదకరంగా ఉన్న కుంట ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టిసారించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బొమ్మల సెంటర్ మలుపు వద్ద కాలువపై కుంట

# రహదారులు అధ్వానం..!

- చినుకు పడితే బురదమయం
- నరకం చూస్తున్న ప్రయాణికులు

పర్చూరు, జూలై 13 : చినుకు పడితే చిత్తడే అన్న విధంగా రహదారులు పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా రహదారులు పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లపైకి నీరు చేరడంలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నరకం చూస్తున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన ఆయా గ్రామాల్లోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షం కురిస్తే నీరు పారుదల లేక రోడ్లపై ప్రవహించడం, రోజుల తరబడి నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో సమస్య మరింత దారుణంగా మారుతోంది. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే పర్చూరు - చీరాల రహదారిలో పరిస్థితి దయనీయంగా మారింది. అదేవిధంగా పర్చూరు నుంచి గుంటూరు వెళ్లే ప్రధాన ఆర్ అంబీ రోడ్డులోని అడుసుమల్లి సమీపం రోడ్డు చినుకు పడితే రోడ్లు బురదమయమవుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా అధికారులు ప్రజా ప్రతినిధులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పర్చూరు - గుంటూరు రోడ్డులోని అడుసుమల్లి వద్ద ఇలా

**చిత్తడిగా ప్రధాన రహదారులు**

**కాలువలు అధ్వానం**

చీరాలటౌన్ : చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకు కూడా ప్రధాన రహదారులు సైతం చిత్తడిగా మారుతున్నాయి. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి ఉండడంతో నీటి పారుదల లేక డ్రైన్‌లు కంపుకొడుతున్నాయి. మురుగు కాలువలు చెత్తతో నిండిపోయి ఉన్నాయి. కాలువల నుంచి వచ్చే కంపుతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు రాకపోకలు సాగించాలంటే నానా యాతన పడుతున్నారు. డ్రయిన్‌లు శిథిలావస్థకు చేరడంతో వ్యర్థాలు, మురుగు నీరు రోడ్లపైకి చేరుతున్నాయి. కొన్నిచోట్ల చెత్త సేకరణ అసంపూర్తిగా ఉంది. మరోవైపు వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముక్కోణపు పార్క్ సమీపంలో సులాభ్ కాంప్లెక్స్ నుంచి వచ్చే వ్యర్థాలను కాలువలకు కలిపారు. ఆ ప్రాంతంలో డ్రైన్‌లో పారుదల సక్రమంగా లేదు. ఇదిలావుండగా శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రధాన రహదారులు చిత్తడిగా మారాయి. ఈక్రమంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు, ప్రయాణికులు వేడుకుంటున్నారు.



వ్యర్థాలతో నిండిన కాలువ.. చీరాలలో గుంతలో నిలిచిన వాన నీరు

## తెగిన విద్యుత్ తీగ గేదె మృతి



మృతి చెందిన గేదె

బల్లికురవ, జూలై 13 : మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఈదురు గాలులు పెద్ద ఎత్తున వీయడంతో విద్యుత్ తీగలు తెగి పడి గంగవరపు ఆది నారాయణకు చెందిన పాడి గేద మృతి చెందింది. ఇంటి ముందు ఉన్న గేదపై విద్యుత్ వైర్లు తెగి పడడంతో గేద అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేద విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతు తెలిపారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. వైరు తెగిపోవడంతో సిబ్బంది సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

## సదరం శిబిరాన్ని వినియోగించుకోవాలి



దివ్యాంగులకు పళ్లను పంపిణీ చేస్తున్న హరిప్రసాద్

పర్చూరు, జూలై 13 : పర్చూరు నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ మామిడిపాక హరిప్రసాద్ కోరారు. శనివారం స్థానిక వైద్యశాలలో ఏర్పాటు చేసిన సదరం క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పత్యేక ఏర్పాట్లు చేసే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా దివ్యాంగులకు కావలసిన మౌలిక వసతులు కల్పించే విధంగా తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు పళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి

**ఈఈ మస్తాన్‌రావు**

అద్దంకి, జూలై 13 : క్షేత్ర స్థాయిలో విద్యుత్ సిబ్బంది మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బందితో శనివారం స్థానిక గీతామందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ నల్లూరి మస్తాన్‌రావు మాట్లాడుతూ సిబ్బంది నిత్యం విద్యుత్ లైన్‌లను పరిశీలిస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది పై పలు చోట్ల వస్తున్న ఫిర్యాదులను ఈ సందర్భంఆ ఆయన గుర్తుచేశారు. సమావేశంలో అద్దంకి, మార్టూరు డీఈఈలు సత్యనారాయణ, సురేంద్రబాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

**వ్యవసాయ కనెక్షన్‌లకు అదనంగా చెల్లించవద్దు**

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల మంజూరుకు విద్యుత్ శాఖ అధికారులకు రైతులు అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు శనివారం తెలిపారు. డివిజన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు అధికారులు వెంటనే అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. ప్రస్తుతం మంజూరైన వ్యవసాయ కనెక్షన్‌లతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వవద్దన్నారు. బల్లికురవ మండలంలో పలువురు రైతుల వద్ద నుంచి అదనంగా వసూలు చేస్తున్నట్లు అందిన ఫిర్యాదుపై విద్యుత్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.



ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా నూతన కార్యవర్గం

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నూతన కమిటీ

అద్దంకి, జూలై 13 : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా నూతన అధ్యక్షుడిగా ఆర్.అమర్నాథ్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా యూనిట్ సమావేశం శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అద్దంకి తహసీల్దార్ కార్యాలయం ఏఎస్‌వో అమర్నాథ్, కార్యదర్శిగా మున్సిపల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కే చెంచయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా అద్దంకి మండల వ్యవసాయాధికారి కొ్రపాటి వెంకటకృష్ణ, ట్రెజరర్‌గా కొటికలపూడి పంచాయతీ కార్యదర్శి విజయ్ పాల్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ఎన్నిక జిల్లా అధ్యక్షుడు రోశయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ



నేత్రాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అద్దంకి టౌన్, జూలై 13 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం నేత్రాలను సేకరించారు. అద్దంకిలోని కొత్తపేటకు చెందిన కురిచేటి కోటయ్య (78) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో కోటయ్య కళ్లను దానం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళి సుధాకరరావు శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వైద్యులను సంప్రదించారు. డాక్టర్ దీక్ష సిబ్బందితో వచ్చి కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మహమ్మద్ రఫీ, నందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఏపీజీఈఏ మార్టూరు అధ్యక్షుడిగా సింగారెడ్డి



ఏపీజీఈఏ నూతన కమిటీ సభ్యులు

మార్టూరు, జూలై 13 : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మార్టూరు తాలూకా యూనిట్ నూతన కమిటీ ఎన్నికలు శనివారం మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం భవనంలో జరిగాయి. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. వాటిలో మార్టూరు తాలూకా అధ్యక్షుడిగా ఇండేల సింగారెడ్డి, కార్యదర్శిగా జీ ఆంజనేయులు, కోశాధికారిగా డి మురళి గౌరవ అధ్యక్షులుగా దంత వైద్యులు భానుచంద్రనాయుడు ఎన్నికయ్యారు. అదేవిధంగా సభ్యులుగా పీ శైలజ, ఏ తిరుమల, కే సుష్మ, కే ప్రమీల, రమణమూర్తి, చెన్నకేశవులు, కే రారాజు, హనుమంతరావు మీరావలి, దుర్గాదేవి, భూపేల్ రెడ్డిని ఎంపిక చేశారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కే రోశయ్య, కార్యదర్శి కే శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వారి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికైంది.

## అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, జూలై 13: విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య తన భార్య సులోచన జ్ఞాపకార్థం శనివారం స్థానిక అమ్మ ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టరు కొ్రపాటి లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, సతీష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు, జూలై 13 : మండలంలోని పావులూరులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు తాటిపర్తి నారపరెడ్డి మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులు వెంకటరత్నం, అంజిరెడ్డి, సుబ్బారెడ్డి, బద్రిరెడ్డిని రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోమనరావు, జెట్టి స్వామి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, సాంబశివరావులు అభినందించారు.

## మార్టూరు స్టేషన్ నుంచి నలుగురు బదిలీ

మార్టూరు, జూలై 13 : మార్టూరు పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారిలో హెడ్ కానిస్టేబుల్ రైటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయిరాం వెదుళ్లపల్లి స్టేషన్‌కు బదిలీ కాగా, కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న రమేష్ మేదరమెట్ల స్టేషన్‌కు, హరిబాబు బల్లికురవ స్టేషన్‌కు, రాజు అద్దంకి స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం స్టేషన్‌కు ఆదేశాలు వచ్చాయి.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గర్నెపూడి(పర్చూరు), జూలై 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పర్చూరు మండలం గర్నెపూడి గ్రామానికి చెందిన ఏ పేరయ్య(55) ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి ఈనెల 11న స్వగ్రామం వస్తుండగా అన్నంబొట్లంవారిపాలెం సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి గాయపడ్డారు. అతనిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

అద్దంకి, జూలై 13 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో భవనాసి కాలువ సమీపంలో శుక్రవారం రాత్రి 37 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన వ్యక్తిని 108లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్థరాత్రి దాటిన తరువాత మృతి చెందారు. ఈ మేరకు ఒంగోలు రిమ్స్ అవుట్‌పోస్టు నుంచి అద్దంకి పోలీస్ స్టేషన్‌కు సమచారం అందింది.

## కోలలపూడి శతాబ్దికి అవార్డు

మార్టూరు, జూలై 13 : మండలంలోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కోలలపూడి శతాబ్దికి ఉత్తమ అధ్యక్షురాలిగా కందిమళ్ల నిర్మలకు, మరో 11 అవార్డులు వచ్చినట్లు ఇన్నర్‌వీల్ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌లో జరిగిన ఇన్నర్ వీల్ క్లబ్ కార్యక్రమంలో నిర్మలకు డిస్ట్రిక్-315 అసోసియేషన్ అధ్యక్షురాలు సునీతజైన్, డిస్ట్రిక్ చైర్‌పర్సన్ కోలా విజయలక్ష్మి చేతుల మీదగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలలో చైతన్యం తీసుకు వచ్చే కార్యక్రమాలతోపాటు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించిన కోలలపూడి క్లబ్-71 ప్రాజెక్టులు పూర్తి చేసినందుకు 11 ఉత్తమ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శివకుమారి, అరుణకుమారి పాల్గొన్నారు.



అవార్డును అందజేస్తున్న ఇన్నర్‌వీల్ ప్రతినిధులు